ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 6 ఆగస్టు 2025

ఆదిత్యాలయంలో విజిలెన్స్ విచారణ

అరసవల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామి దేవస్థానం కార్యాలయంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. గతంలో ఆలయంలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు, దినసరి వేతన దారులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. గత ఏడాది ఆలయ ఈవోగా చంద్రశేఖర్ పనిచేసిన కాలంలో మార్చి నుంచి జూన్ వరకు గల ఓచర్లు, అకౌంట్స్ వివరాలను పూర్తిగా పరిశీలించి, వివరాలను సేకరించారు. అనంతరం ఆలయానికి చెందిన డిపాజిట్లు ఉన్న ఏపీజీవీ బ్యాంకుకు వెళ్లి మరికొన్ని వివరాలను ఆరా తీశారు.

రైతుల్లో ఆనందోత్సాహం





నరసన్నపేట: అన్నదాత సుఖీభవ డబ్బులు తీసుకునేందుకు వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న యూనియన్ బ్యాంకు

- 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ
- డబ్బులు తీసుకునేందుకు బ్యాంకులకు పరుగు
- పెట్టుబడులకు ఊతం

'అన్నదాత సుఖీభవ' నగదు తమ ఖాతాల్లో జమ కావడంతో రైతులు ఆనందోత్సాహాల్లో తేలియాడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేసిన ఈ పథకం సొమ్మును డ్రా చేసుకోవడానికి వస్తోన్న రైతులతో బ్యాంకుల వద్ద సందడి నెలకొంటుంది. నగదు లెక్కపెట్టుకుంటూ, పరస్పరం పలకరించుకుంటూ ఉత్సాహంగా కనిపిస్తున్నారు. పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో తొలి విడతగా పీఎం కిసాన్ కింద రూ.2వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5 వేలు మొత్తం రూ.7 వేలు రైతులకు అందడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు విడతలుగా వారికి రూ.20వేలు అందనుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో 2.70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది.

-ఆంధ్రజ్యోతి బృందం

ఆనందంగా ఉంది..



నాకు ఎకరా 63 సెంట్ల భూమి ఉంది. పీఎం కిసాన్ కింద రూ2వేలు, అన్నదాత సుఖీభవ కింద రూ.5వేలు నా బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. ఈ డబ్బులు ఖరీఫ్ సాగు పెట్టుబడులకు ఉపయోగిస్తాను. మదుపుల కోసం అప్పు చేయాల్సిన అవసరం తప్పింది. అన్నదాత సుఖీభవ పథకం వర్తించడం మాకు ఆనందంగా ఉంది.

-బడియా మామయ్య, లొద్దపుట్టి, ఇచ్ఛాపురం

సీఎంకు కృతజ్ఞతలు..



నాకు 50 సెంట్ల భూమి ఉంది. ఇందులో వరి పంటను సాగు చేస్తున్నాను. మదుపులకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు రూ.7వేలు నా బ్యాంకు ఖాతాలో జమ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-లక్కోజు ఉమామహేశ్వరరావు, దీర్ఘాశి, పోలాకి

ఎరువులు కొనుగోలు చేస్తా..



నాకు ఎకరా పొలం ఉంది. అందులో వరి ఎదలు వేశాం. కలుపు తీసి సస్యరక్షణ చర్యలు చేపట్టాం. ఎరువుల కోసం ఏమి చేయాలి అనే ఆలోచన చేస్తున్న సమయంలో అన్నదాత సుఖీభవ కింద రూ.7 వేలు నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం వేసింది. ఈ డబ్బులతో ఎరువులు కొనుగోలు చేస్తా. మదుపుల కోసం డబ్బులను వెదకనవసరం లేకుండా అయింది.

-కూన అప్పారావు, అబ్బాయిపేట, జలుమూరు

మదుపులకు వినియోగిస్తా..



అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద తొలి విడత రూ.7వేలు జమకావడం ఆనందంగా ఉంది. మూడు విడతల్లో మొత్తం రూ.20 వేలు జమచేస్తుండడంతో వ్యవసాయం దండగ కాదు పండగ అనే పరిస్థితి ఉంది. ఈ డబ్బులను వ్యవసాయ మదుపులకు వినియోగిస్తా.

-తంగి అప్పారావు, తంగివానిపేట, ఎచ్చెర్ల

సరైన సమయంలో డబ్బులు పడ్డాయి..



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. వరి పంటను సాగు చేస్తున్నాను. పురుగు మందులు, ఎరువుల కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నా. సరైన సమయంలో అన్నదాత సుఖీభవ కింద రూ.7వేలు నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం వేయడం ఎంతో ఆనందంగా ఉంది. మదుపుల కోసం ఈ నగదును వినియోగిస్తా.

-బోర సంపతిరావు, పెద్దలోగిడి, పాతపట్నం

రుణం తీర్చాను..



గత ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడులకు బ్యాంకులో రూ.10వేలు రుణం తీసుకున్నాను. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.7వేలు పెట్టుబడి సాయం అందించింది. ఆ డబ్బులకు నేను మరో రూ.3వేలు కలిపి బ్యాంకు అప్పు తీర్చాను. మరలా ఈ ఏడాది పెట్టుబడులకు బ్యాంకు నుంచి ఇబ్బంది లేకుండా రుణం తీసుకున్నాను.

-జుత్తు రాజారావు, దశమంతుపురం, నరసన్నపేట

ఎరువులు కొనుగోలు చేశా..



నాకు ఎకరన్నర పొలం ఉంది. ప్రభుత్వం అందించిన అన్నదాత సుఖీభవ నిధులు రూ.7వేలతో ఎరువులు కొనుగోలు చేశా. అలాగే పురుగు మందులు, పెట్టుబడులకు కొంత వరకు ఊతం ఇచ్చాయి. సీఎంకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

-పీస తాత, నర్సింగపల్లి, నరసన్నపేట

సీఎం బాగుండాలి..



రైతుల సంక్షేమ కోసం ఆలోచించే సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వ నాయకులు చల్లగా ఉండాలి. ఈఏడాది రూ.7వేలు రైతులు ఖాతాల్లో వేయడం చాలా ఆనందంగా ఉంది. పెట్టుబడి సాయం చిన్న, సన్నకారు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంది.

-గొండు అచ్యుతరావు, జమ్ము జంక్షన్, నరసన్నపేట



దుర్యోధన



జశ్వంత్



రాజేష్

సరదాగా గడిపేందుకు వెళ్లి..

- సముద్రంలో ముగ్గురు యువకుల గల్లంతు
- భావనపాడు తీరంలో ఘటన ● మూడు కుటుంబాల్లో విషాదం

వజ్రపుకొత్తూరు/టెక్కలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురూ మంచి స్నేహితులు. ముగ్గురూ డిప్లొమా చదువుతున్నారు. సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లారు. కొద్దిసేపు తరువాత స్నానం కోసం సముద్రంలోకి దిగారు. అలల తాకిడికి వారు గల్లంతయ్యారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం భావనపాడు తీరంలో చోటు చేసుకుంది. వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి పంచాయతీ మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన (18), పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండల టెక్కలిపట్నంకు చెందిన రాయల రాజేష్(19) విజయనగరం జిల్లా గజపతినగరంలోని ఓ కళాశాలలో డిప్లొమ చదువుతున్నారు. ఈ ముగ్గురూ స్నేహితులు. మంగళవారం సాయంత్రం బావనపాడు తీరానికి వెళ్లారు. అక్కడ కొంత సమయం ఆనందంగా గడిపిన తరువాత సముద్ర స్నానానికి దిగారు. అలల ఉధృతికి ముగ్గురూ కొట్టుకుపోయారు. అటుగా వస్తున్న మత్స్యకారులు యువకుల గల్లంతును గుర్తించి స్థానికులకు, మెరైన్ (మిగతా 6వ పేజీలో..)

మా రూటే వేరు!

- అడ్డదారిలో ఇసుక తరలింపు ● రోజూ వందలాది వాహనాల్లో..
- నిఘాకు చిక్కకుండా రవాణా ● కొందరు అధికారుల సహకారం?



జేఆర్‌పురంలోని రామతీర్థాలు రోడ్డులో నిత్యం ఇలా ఇసుక లారీలు తరలిపోతున్నాయి. ఈ మార్గం పగలంతా రద్దీగా ఉంటుంది. కానీ, సాయంత్రం 7 గంటలు దాటిన తరువాత దొడ్డిదారిలో ఇసుక లారీల రాక మొదలవుతుంది. ఉదయం 5 గంటల వరకూ దాదాపు 100 ఇసుక లారీలు ఇదే రూట్లో వెళ్తుంటాయి. నెల్లిమర్ల మీదుగా విజయనగరం, విశాఖ నగరాలకు ఇసుక అక్రమంగా తరలిపోతుంది. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

రణస్థలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంశధార, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలు చాలా ఉన్నాయి. వాటిలో ప్రభుత్వం అధికారికంగా రీచ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా ఇసుకను అందిస్తోంది. కానీ, ఉచితం మాటున ఇసుక లూటీ యథేచ్ఛగా జరుగుతుంది. ఇసుకాసురులు జాతీయ రహదారి గుండా కాకుండా.. అంతర్ జిల్లా లింకు రహదారులను మార్గాలుగా ఎంచుకొని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా రణస్థలం మీదుగా నెల్లిమర్ల..అక్కడ నుంచి విజయనగరం, ఆపై విశాఖ నగరాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులకు తెలిసినా మౌనం దాల్చుతుండడం అనుమానాలకు తావిస్తోంది. వారికి మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల ప్రమేయం..

వాస్తవానికి పైడిభీమవరం వద్ద ఇసుక లారీలను నియంత్రించేందుకు ఉన్నతాధికారులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. తప్పుడు వే బిల్లులతో ఇసుక తరలిస్తున్న వాహనాలు ఈ చెక్‌పోస్టు వద్ద గతంలో పట్టుబడ్డాయి. దీంతో అధికారులు చెక్‌పోస్టు వద్ద నిఘా మరింత కట్టుదిట్టం చేశారు. దీంతో ఇసుకాసురులు రూటుమార్చారు. రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు జంక్షన్ వద్ద ఇసుక వాహనాలు యూటర్న్ తీసుకుని, కమ్మసిగడాం, రామతీర్థాలు, నెల్లిమర్ల మీదుగా విజయనగరం, ఆపై విశాఖకు వెళ్తున్నాయి. ఇలా ప్రతిరోజూ జిల్లా నుంచి 150 లారీల ఇసుక విశాఖకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో సగానికి సగం నకిలీ వే బిల్లులతోనే ఇసుక తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ప్రజాప్రతినిధుల ప్రమేయం కంటే కొందరి అధికారుల పాత్ర ఎక్కువగా ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వారి ప్రమేయం లేకుండా ఇసుకను సరిహద్దులు దాటించడం అంత సులువు కాదు. అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ కళ్లుగప్పి ఇసుక తరలించుకుపోతున్నారంటే వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అధికారులు ఎవరు? అన్నది ఇప్పుడు పెద్ద చర్చకు దారితీస్తోంది.

లారీలకు బదులు టిప్పర్లు

గతంలో ఇసుక తరలించేందుకు అక్రమార్కులు ఎక్కువగా లారీలను వినియోగించేవారు. కానీ, ఇప్పుడు భారీ స్థాయిలో టిప్పర్లను ఉపయోగిస్తున్నారు. లోతైన క్యాబిన్ ఉండడంతో ఒక్కో టిప్పర్‌లో 10 టన్నుల వరకూ ఇసుక పడుతుంది. అంటే 8 ట్రాక్టర్ల లోడును ఒకేసారి టిప్పర్‌లో తీసుకెళ్లవచ్చు. టిప్పర్ ఇసుక రూ.30 వేల పైమాటే. దూరం బట్టి (మిగతా 6వ పేజీలో..)

భారీగా గంజాయి పట్టివేత

- మూడుచోట్ల పోలీసుల తనిఖీలు ● 52 కిలోలు స్వాధీనం ● తొమ్మిది మంది అరెస్టు

జిల్లాలో మంగళవారం భారీ స్థాయిలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలాస, ఇచ్ఛాపురం, శ్రీకాకుళంలో మూడు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 52 కిలోల గంజాయి పట్టుబడింది. తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పలాస: వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన రూ.2 లక్షల విలువైన 16.4 కిలోల గంజాయితో తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేసినట్టు డీఎస్పీ వి. వెకంట అప్పారావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు నగర్‌కు చెందిన ముత్తురామన్, సుందరపాండేయపురం గ్రామానికి చెందిన మరిముత్తు ఇద్దరూ స్నేహితులు. వీరికి అదే ప్రాంతానికి చెందిన గంజాయి విక్రయదారు మణికం రతో పరిచయం అయింది. ఒడిశా నుంచి గంజాయి తీసుకువస్తే కిలోకు రూ.1500 ఇస్తానని చెప్పడంతో వారిద్దరూ ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన పట్నాస్ వద్ద గంజాయి కొనుగోలు చేసి పలాస రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వచ్చారు. ఈ క్రమంలో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి తన సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా వారిద్దరూ తారాసపడ్డారు. వారి వద్ద గల గోనెసంచె తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. వారు పరారయ్యేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి వారిద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ పి.సూర్యనారాయణ, పోలీసులు ఉన్నారు.

ఇచ్ఛాపురంలో ..

ఇచ్ఛాపుపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ముంబైకి గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మహరాష్ట్రకు చెందిన మణికుమార్ నారాయణ భాయ్ పవార్ అనే వ్యక్తి ముంబైలోని దాదర్ ప్రాంతంలో పూల వ్యాపారం (మిగతా 8వ పేజీలో..)



పాఠశాల ఎదుట ఆందోళన చేపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఈ టీచర్లు మాకొద్దు

- పట్టులోగాంలో విద్యార్థినులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఉపాధ్యాయుల మధ్య గొడవతో నష్టపోతున్నామని ఆవేదన

6లో

శభాష్.. మేజర్ కవిత

- సిక్కోలు యువతికి అరుదైన గౌరవం
- బ్రహ్మపుత్రలో 1040 కి.మీ. ర్యాఫ్టింగ్ ప్రయాణం
- అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



మేజర్ కవితను అభినందిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

శ్రీకాకుళం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సిక్కోలు యువతికి అరుదైన గౌరవం దక్కింది. మెట్టూరు గ్రామానికి చెందిన వసుపల్లి కవిత బ్రహ్మపుత్ర నదిలో 1040 కిలోమీటర్ల ర్యాఫ్టింగ్ ప్రయాణం చేసి అరుదైన రికార్డు నెలకొల్పింది. ఇటీవల లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు తన పేరును నిలుపుకొన్నారు. బ్రహ్మపుత్ర నదిలో అన్ని కిలోమీటర్లు ర్యాఫ్టింగ్ యాత్రను పూర్తిచేసిన ఏకైక మహిళగా రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ ప్రమాదకరమైన ప్రయాణంలో ర్యాఫ్ట్ నాలుగుసార్లు తిరగబడింది. ప్రవాహధాటికి చిక్కుకుపోయిన సందర్భాలూ ఉన్నాయి. అయినా టీమ్ వర్క్.. భగవంతుని ఆశీస్సుల వల్ల గమ్యాన్ని చేరుకున్నామని మేజర్ కవిత వెల్లడించారు. ఇంతటితో ఆగకుండా 'మౌంట్ గొరిచెన్' పర్వతం అధిరోహించే యాత్రలో 5,900 మీటర్ల ఎత్తున అపస్మారక స్థితిలోకి వెళ్లిన సహపర్వతారోహకుడిని కాపాడి ఆమె అసాధారణ ధైర్యాన్ని చూపించింది. ఇందుకు గుర్తింపుగా 'సీఓఏఎస్ కామెండేషన్ అవార్డు' ఆమెకు లభించింది. ఈ నేపథ్యంలో ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మేజర్ కవిత కలుసుకున్నారు. కవిత సాహసయాత్రలు, ప్రత్యేకించి అడ్వెంచర్ స్పోర్ట్స్‌ని ముఖ్యమంత్రి ప్రశంసించారు. 'మేజర్ కవిత జీవిత ప్రయాణం దేశ యువతకు ప్రేరణగా నిలుస్తుంది. యువతీ యువకులు అడ్వెంచర్ రంగాల్లో తమకు ఇష్టమైన మార్గాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి' అని సీఎం అన్నారు.

టీచర్ ప్రోత్సాహం.. గ్రామస్థుల చొరవ

- దూగానపుట్టుగ ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు
- 13 నుంచి 55కు పెరిగిన పిల్లల సంఖ్య



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవో, గ్రామస్థులు

కవిటి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీచర్ ప్రోత్సాహానికి గ్రామస్థుల చొరవ తోడవడంతో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. మండలంలోని దూగానపుట్టుగ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1నుంచి 8వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు చదివేవారు. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానంతో ఈ పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతులు మాత్రమే మిగిలాయి. ఈ తరగతుల్లో కేవలం 13మంది విద్యార్థులే ఉన్నారు. దీంతో గ్రామంలో పాఠశాల మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని ఏకోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న (మిగతా 7వ పేజీలో..)

పశువులను కాపాడితే

- రైతులకు ప్రయోజనమని భావిస్తున్న ప్రభుత్వం
- సంతతి పెంచేందుకు రూ.150కే మేలుజాతి వీర్యం

6లో

మంత్రి చెప్పినా వినలే!

- టెక్కలిలో నిరుపయోగంగా ఆసుపత్రి భవనాలు
- ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని అచ్చెన్న సూచన
- శుభ్రం చేసి చేతులు దులుపుకొన్న అధికారులు

6లో

కలెక్టర్ ఎదుట పురుగుమందు తాగేయత్నం

- రిమ్స్‌కు మహిళ తరలింపు

6లో

పశువులను కాపాడితే..!

- రైతులకు ప్రయోజనమని భావిస్తున్న ప్రభుత్వం
- సంతతి పెంచేందుకు రూ.150కే మేలుజాతి వీర్యం
- జిల్లాకు 15 లక్షల డోసులు.. ఉచితంగా పిండమార్పిడి

శ్రీకాకుళం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పశువులను కాపాడి తద్వారా రైతులకు ఎంతో ప్రయో జనం చేకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఆడ పెయ్యిల సంతతిని మరింతగా పెంచాలని భావిస్తోంది. మేలు జాతికి సంబంధించిన వీర్యాన్ని రూ.150 కు అందిస్తోంది. ఇప్పటి కే పంపిణీని ప్రారంభించింది. ఇది వరకు రూ.500కు అందిస్తుండగా మరింత మంది లబ్ధి పొం దాలన్న ఉద్దేశంతో ప్రభు త్వం ధర తగ్గిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. స్వ ర్ణాంధ్ర- 2047లో భాగంగా ప్రజల జీవన ప్రమా ణాలు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా పాడి పరిశ్రమ అభి వృద్ధికి ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై పాడి రైతు లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వీర్యానికి సంబంధించి 15 లక్షల ఇంజెక్షన్లను అందుబాటులోకి తె చ్చారు. ప్రభుత్వం అన్ని పశువుల ఆస్పత్రులు, రైతు సేవా కేంద్రాల్లో వీటిని పొందే వెసులు బాటు కల్పించింది.


● రూపాయి ఖర్చు లేకుండా..

పాడి అభివృద్ధి విషయంలో టీడీపీ ప్రభుత్వం ముందు ఉంటోంది. సీజన్ల వారీగా శిబిరాల నిర్వహణ, ఇతరత్రా విషయాల్లో ఎప్పటికప్పుడు చొరవ చూపుతోంది. ఇప్పటికే నేరుగా పశువులకు పిండ మార్పిడి ప్రక్రియను ఉచితంగా చేపడుతోంది. ఎంబ్రోగా పిలిచే ఈ ప్రక్రియకు రూ.5 వేలు ఖర్చు అవుతుంది. కానీ ప్రభుత్వం మాత్రం పాడి రైతులకు భారంగా ఉండకూడదనే ఉద్దేశంతో ఉచితంగా అందిస్తోంది. ఈ పిండ మార్పిడికిగాను జిల్లాలో ఇద్దరు పశు వైద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పశువులకు పిండ మార్పిడికి అవసరమైన పాడి రైతులు దరఖాస్తు చేసుకుంటే అందించేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారు. జెర్సీ, ఒంగోలు లాంటి జాతుల లక్షణాలు పశువులకు శతశాతం రావాలంటే ఏడు ఈతల వరకూ చూడాల్సిందే. కానీ పిండ మార్పిడితో శతశాతం లక్షణాలు పశువులకు లభిస్తాయి.

ప్రతి ఏడాది రెట్టింపు ఆవులు..

పశువుల సంతతి మొన్నటి వరకు సగం మగ దూడలు.. సగం ఆడ దూడలు జన్మించేవి. ఇప్పుడు ట్రిపుల్ ఎస్ పద్ధతిని ప్రభుత్వం తీసుకు వచ్చింది. తెలుగులో లింగ నిర్ధారిత వీర్యంను రాయితీపై పంపిణీ చేస్తోంది. పశువులకు ఆడ దూడలు మాత్రమే జన్మించేలా 'ఎద' ఇంజక్షన్‌లను ఇస్తున్నాం. గతేడాది జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తే 90 శాతం సక్సెస్ రేటు లభించింది. ప్రతిఏటా ఆవుల సంఖ్య రెట్టింపు అవుతుంది. రెండేళ్ల వయసున్న ఆవులు మళ్లీ ఎద ఇంజక్షన్‌లు ఇస్తే అవికూడా గర్భం దాల్చు తాయి. ఆడ దూడలనే ప్రసవిస్తాయి. ఈ ఏడాది 25వేల ఇంజక్షన్లు లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల పశువైద్య కేంద్రాలు, గ్రామీణ పశువైద్యకేంద్రాలు, పశు వైద్యశాల, రైతు సేవా కేంద్రాల్లోనూ (మొత్తం 240 కేంద్రాల్లో) ఇంజక్షన్‌లను పశువులకు వేస్తారు. దీని ద్వారా జెర్సీ, హెచ్ ఎఫ్, ఒంగోలు, పుంగనూరు జాతి ఆడ ఆవు దూడలు పుడుతాయి. పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

-కె.రాజగోపాలరావు, జిల్లా పశుసంవర్థక అధికారి



మేలుజాతి ఆవు, దూడ

● ఆవుల మృత్యువాతతో..

జిల్లాలో సంతానోత్పత్తికి సంబంధించి ఉపయోగపడే పాడి పశువులు 3.24 లక్షల వరకూ ఉన్నట్టు అంచనా. వీటికి మేలుజాతి వీర్యం ఇంజక్షన్లు వేస్తే పాడి అభివృద్ధికి అవకాశం ఉంటుంది. వాస్తవానికి 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అప్పట్లో పాడి పశువుల అభివృద్ధికిగాను ఇతర ప్రాంతాలకు చెందిన మేలు జాతి ఆవులను అందించింది. సంతానోత్పత్తి సమయంలో ఆవులు చాలా వరకూ అనారోగ్యానికి గురయ్యాయి. మృత్యువాత పడ్డాయి. ఇక్కడి వాతావరణానికి తట్టుకోలేక మృతి చెందినట్టు నిపుణులు స్పష్టం చేశారు. అందుకే ఇప్పుడు మేలుజాతి వీర్యం అందించేందుకు నిర్ణయించారు. జిల్లాలో పాల అభివృద్ధి పెంచడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా సాంకేతికతో అభివృద్ధి చేసిన మేలు జాతి వీర్యాన్ని అందిస్తోంది. దీనికి సంబంధించిన బాధ్యత లను పశు వైద్యాధికారులు, వెటర్నటీ సచివాలయ కార్యదర్శులు, గోపాలమిత్రలు చూసుకుంటారు.

తీరాన్ని చెక్కిన కెరటాలు

అరసవల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 'కదలని ఆ సైకత అలలపై తేలియాడే నావ ఏ దూరతీరాలకు సాగేనో..' అన్నట్లుగా ఉండే ఈ దృశ్యం గార మండలం బందరువానిపేట సముద్ర తీరాన ఆవిష్కృతమైంది. ఎగిసిన సముద్రపు అలలు ఇసుక తీరాలను చేరి, కెరటాల కుంచెతో అలల చిత్రాలను ఒడ్డుపై చెక్కినట్లుగా కనిపించింది. ఈ అపురూప దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ తన కెమెరాతో బంధించారు.



వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుద్ధ ఏకాదశి సంద ర్భంగా మంగళ వారం అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామివారి కళ్యాణం వైభవంగా నిర్వ హించారు. అని వెట్టి మండపంలో ప్రధా నార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేదపండితులు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ వేడుకను జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భ ముళ్ల శ్రీనివాసశర్మ, ఆర్.వికాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యునికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యూ ఆకారంలో బెంచీల ఏర్పాటు

● కేరళ రాష్ట్రం బాటలో..

కంచిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో మొట్ట మొదటి సారిగా యూ ఆకారపు తరగతి ఏర్పాటు చేశారు. బ్యాక్ బెంచ్ అనేది లేకుండా విద్యార్థులంతా ఒకే వరుసలో ఉండేలా అర్జునాపురం ఎంపీపీ పాఠశాలలో అమలు చేశారు. ఈ తరహా విధానం కేరళ రాష్ట్రంలో అమలులో ఉంది. ఈ మేరకు యూ ఆకారంలో బెంచ్‌లు ఏర్పాటు చేసి బోధన చేయడంపై ఎంఈవో సప్పటి రామప్రసాద్ నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యూ ఆకారంలో బెంచీలను ఏర్పాటు చేసి బోధిస్తున్న దృశ్యం

మంత్రి చెప్పినా వినలే!

- టెక్కలిలో నిరుపయోగంగా ఆసుపత్రి భవనాలు
- ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని అచ్చెన్న సూచన
- శుభ్రం చేసి చేతులు దులుపుకున్న అధికారులు

టెక్కలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని ఆసుపత్రి భవనాలు నిరుపయోగంగా మారాయి. వీటిని అద్దె భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు చెపారు. అధికారులు మాత్రం గదులను శుభ్రంచేసి చేతులు దులుపుకున్నారు.

ఎన్టీ రామారావు 1994లో టెక్కలి ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇక్కడి ప్రజలకు కానుకగా వంద పడకల ఏరియా ఆసుపత్రిని మంజూరు చేశారు. అప్పట్లో రూ.16కోట్ల వ్యయంతో ఏ, బీ బ్లాకులుగా ఆసుపత్రి నిర్మాణం జరిపించి 1999లో ప్రజలకు అందించారు. ఎమర్జెన్సీ, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్, ఆపరేషన్స్, రక్త నమూనాలు సేకరణ తదితరవన్నీ ఎ-బ్లాకులో, ప్రసూతి విభాగం బి-బ్లాకులో నిర్మాణం చేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లా కేంద్రానికి రిమ్స్ ఆసుపత్రి మంజూరు చేయడంతో.. జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి పాలకొండకు తరలించాలని అప్పటి ప్రజాప్రతినిదులు పట్టుబట్టారు. అయితే టెక్కలి ఎమ్మెల్యేగా ఉన్న హనుమంతు అప్పయ్యదొర పట్టుబట్టి మరీ జిల్లా కేంద్ర ఆసుపత్రిని టెక్కలి తీసుకురాగలిగారు. దీంతో ఏరియా ఆసుపత్రి జిల్లా కేంద్ర ఆసుపత్రిగా రూపాంతరం చెందింది. అప్‌గ్రేడేషన్ దరిమిలా జిల్లా కేంద్ర ఆసుపత్రి భవనాల నిర్మాణం రూ.30కోట్లతో వంశధార కార్యాలయం ప్రాంగణంలో చేపట్టారు. దీంతో జిల్లా కేంద్ర ఆసుపత్రిగా విస్తరించబడి సేవలను 2019 నుంచి కొత్త భవనాల్లోనే ప్రారంభమయ్యాయి. పాత జిల్లా కేంద్ర ఆసుపత్రి భవనాల్లో ఒక్క మార్చురీ గది తప్ప మిగిలినదంతా నిరుపయోగమైంది. నిర్మాణం జరిగిన రెండు దశాబ్దాలు కాలంలోనే పాత ఆసుపత్రి విడిచిపెట్టడంతో ప్రజాధనం వృథాగా పోయింది. దీంతో ఈ భవనాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. కొంతమేరకు అవసరమైన సామగ్రి సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా డివిజన్ కేంద్రమైనటెక్కలిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు పాత జిల్లా కేంద్ర ఆసుపత్రికి మార్చాలని 2019లో ఎమ్మెల్యేగా ఉన్న అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. ఆ తరువాత అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి అచ్చెన్నాయుడు పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు పాత ఆసుపత్రి సిద్ధం చేయాలని చెప్పగా.. అధికారులు పరిశుభ్రం చేసి అక్కడితో సరిపెట్టారు. ఇప్పటికైనా అధికారులు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు పాత ఆసుపత్రికి మారిస్తే కొంతమేరకు ప్రయోజనం కలుగుతుందని ప్రజలు కోరుతున్నారు.



పాత జిల్లా కేంద్ర ఆసుపత్రి

కలెక్టర్ ఎదుట పురుగుమందు తాగేయత్నం

● రిమ్స్ ఆసుపత్రికి మహిళ తరలింపు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): ఆముదాలవలస మండలం మునగవలసకు చెందిన మొద లవలస ధనలక్ష్మి కలెక్టరేట్ పోర్టికో వద్ద మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కలెక్టర్ తన కార్యాలయానికి చేరుకుని కారు దిగుతుండగా.. ఆమె ఎదురుగా వెళ్లి తనతో తీసుకువచ్చిన పురుగులమందు తాగే ప్రయత్నం చేసింది. అప్రమత్తమైన అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. కలెక్టర్ వెంటనే ఆమెను అసిస్టెంట్ కలెక్టర్ వాహనంలో పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి.. అనంతరం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. చౌకధరల దుకాణం డీలర్‌గా తనను తొలగించారని, ఏడా దిన్నరగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నానని, గ్రీవెన్స్‌లో పలుమార్లు విన్నవించుకున్నా తనకు న్యాయం జరగలేదని, అందుకే అత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని ఆమె తెలిపింది. అయితే ఈ వ్యవహారం కోర్టులో ఉందని అధికారులు అంటున్నారు.



రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ధనలక్ష్మి

సరదాగా గడిపేందుకు వెళ్లి..

(ఐదో పేజీ తరువాయి)

పోలీసులకు సమాచారం అందించారు. మెరైన్ సీఐ డి.రాము నేతృత్వంలో మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. వీరివి నిరుపేద కుటుంబాలు. మడేవానిపేటకు చెందిన దున్న మాధవరావు సీతమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు దుర్యోధన కాగా, రెండో కుమారుడు స్థానిక హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి పిల్లలను చదివిస్తున్నారు. ఈ క్రమంలో దుర్యోధన గల్లంతు వార్తతో ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. పూడిజగన్నాథపురం గ్రామానికి చెందిన తిమ్మల వల్లభరావు, సుధ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు జశ్వంత్ ఉన్నాడు. జశ్వంత్ సముద్రంలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. టెక్కలిపట్నం చెందిన రాయల రాజేష్‌ది కూడా పేద కుటుంబమే. రాజేష్‌ను తల్లి జ్యోతి అల్లారుముద్దుగా పెంచింది. కుమారుడు సముద్రంలో గల్లంతయ్యాడని తెలిసి విలపిస్తుంది.

మా రూటే వేరు!

(ఐదో పేజీ తరువాయి)

దీని ధర పెరుగుతుంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

నిఘా పెట్టాం..

ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకొని ఇసుకను ఉచితంగా అందిస్తోంది. కానీ, కొందరు ఇసుకను దొడ్డిదారిన తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రత్యేకంగా నిఘా పెట్టాం. పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద సైతం కట్టుదిట్టం చేస్తాం.

-ఎస్.కిరణ్‌కుమార్, తహసీల్దార్, రణస్థలం



పట్టులోగాం గిరిజన ఆశ్రమ పాఠశాల గేటు వద్ద బైఠాయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

ఈ టీచర్లు మాకొద్దు

- పట్టులోగాంలో విద్యార్థినులు, తల్లిదండ్రుల ఆందోళన
- ఉపాధ్యాయుల మధ్య గొడవతో నష్టపోతున్నామని ఆవేదన

హరిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల టీచర్ల మధ్య ఆధిపత్య పోరును భరించలేక విద్యార్థినులు ఆందోళనకు దిగారు. వారి తల్లిదండ్రులు కూడా ఇందులో పాలుపంచుకున్నారు. ఈ ఘటన మందస మండలం పట్టులోగాం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. ఆశ్రమ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా రాజేశ్వరి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. దీంతో స్థానికంగా పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయినులు హెచ్‌ఎం తీరుపట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంకు సహకరించకుండా.. పాఠాలు సరిగా బోధించేవారు కాదని తల్లిదండ్రులు చెబుతున్నారు. వీరిమధ్య వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. దీంతో దీంతో మంగళవారం విద్యార్థినులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తమ పిల్లలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయకుండా గేటువద్దే బైఠాయించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ బాధ్యులైన టీచర్లను బదిలీ చేసేవరకు నిరసన కొనసాగిస్తామన్నారు. పోలీసులు పాఠశాల వద్దకు వచ్చి సర్దిచెప్పినా వినిపించుకోలేదు. దీంతో టీచర్లే.. విద్యార్థులను ఒప్పించి ఆందోళన విరమింపజేశారు. ఇదే విషయమై ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావును వివరణ కోరగా.. ఇప్పటికే హెచ్‌ఎం రాజేశ్వరిని మందస ఐటీడీఏ గిడ్డంగులకు బదిలీ చేశామని, టీచర్ల వ్యవహార శైలిపై దర్యాప్తు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు.

అర్హులందరికీ పథకాలు చేరాలి

● అమలులో పారదర్శకత పాటించాలి ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్లు, అన్న క్యాంటీన్లు, మున్సిపల్ సేవలు, మహిళలపై నేరాలు, డ్రగ్స్ అరికట్టే విషయంలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. కీ పెర్ఫార్మెన్స్ సూచికలు, పీజీఆర్‌ఎస్, కోర్టు కేసుల పురోగతి, శాఖల సమావేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో తాగునీటి నాణ్యత పరీక్షలు చేయాలన్నారు. చెత్త నుంచి సంపద సృష్టి ద్వారా తయారైన ఎరువులు ఎక్కువగా విక్రయించిన వారికి ప్రోత్సాహకంగా గ్రాంట్లు అందజేస్తామన్నారు. రణస్థలంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆదేశించారు.

● జేసీ పర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ రేషన్ దుకాణాలపై సంబంధిత శాఖల సిబ్బంది తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. రీసర్వే పనులు వేగంగా పూర్తిచేయాలని కోరారు.

● సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఉద్యాన పంటలకు ప్రభుత్వం చేయూత



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

లావేరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలకు కూటమి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం పెదలింగాలవలసలో ఆయిల్‌పామ్ విస్త రణ మహోత్సవంలో భాగంగా రైతులకు ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పతంజలి ఏజీఎం పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో ప్రస్తుత ధరలతో ఎకరానికి రూ.లక్ష వరకు నికర ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు, సర్పంచ్ లుకలాపు యశోద, డీడీహెచ్ లక్ష్మీనారాయణ, డీఎంవో ఆర్‌వీవీ ప్రసాద్, హెచ్‌వో అమరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అనర్హుల డి-పట్టాలు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న చిట్టివలస గ్రామస్థులు

ఆమదాలవలస, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అనర్హులకు మంజూరు చేసిన డి-పట్టాలను రద్దు చేయా లని చిట్టివలస గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. చిట్టివలస గ్రామ పరిధిలోని సైలాడ రెవెన్యూ సర్వే నెంబర్ 183లోని కొండ ప్రాంతంలో రెవెన్యూ అధికారులు అనర్హులకు డి-పట్టాలు పంపిణీ చేశారన్నారు. గడచిన కొన్ని రోజులుగా దీనిపై నిరసనలు తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

విదేశీ వస్తువులను బహిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జాగరణ మంచ్ ప్రతినిధులు, విద్యార్థులు

ఎచ్చెర్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమెరికా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విదేశీ వస్తువులను బహిష్కరించాలని స్వదేశీ జాగరణ మంచ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కన్వీనర్ రాజేష్, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఉమ్మడి కన్వీనర్ డాక్టర్ హనుమంతు శేషగిరి రావు మాట్లాడుతూ.. స్వదేశీ వస్తువుల విని యోగంతో దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మంచ్ జిల్లా కన్వీనర్ గౌరీ శంకర్, జిల్లా కోశాధికారి ప్రవీణ్‌కుమార్, పర్యావరణ ప్రముఖ్ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బొడ్డేపల్లి'కి నేషనల్ ఎంటర్ ప్రీమియర్ అవార్డు



రవికుమార్‌కు అవార్డు అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి లోని తిమ్మాపురా నికి చెందిన బొడ్డేపల్లి రవికుమార్‌కు ప్రతి ష్టాత్మకమైన నేష నల్ ఎంటర్ ప్రీమియర్ అవార్డు లభించింది. ఈ మేరకు అవార్డును శ్రీఫౌండేషన్ ఏడో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం విశాఖ పట్నం పబ్లిక్ లైబ్రరీలో జరిగిన వేడుకల్లో అందజేశారు. రవికుమార్ చేస్తున్న సేవా కార్యక్రమా లు, ముఖ్యంగా రక్తదాన కార్యక్రమాలకు చూపిన చొరవకు ఈ అవార్డు ను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్ర మంలో నెల్లి గురు దేవ్ దత్, ప్రముఖ కంపెనీ సీఈవో శివశంకర్ (అమెరికా), శ్రీ ఫౌండే షన్ చైర్మన్ శ్రీరామ్మూర్తి తదితరులు అందించి అభినందించారు.

ఘనంగా శ్రావణ మంగళవారం పూజలు



స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మ వారి, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శ్రావణ మంగళవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మ వార్లకు సింధూర మర్దన, పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంక రించారు. స్వేచ్ఛావతి అమ్మవారికి పండి వంటలతో నైవేద్యం సమర్పించారు. అమ్మవార్లకు సందర్శించు కునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

పాడి అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

పొందూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాడి అభివృద్ధికి పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంలో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ జి.రఘునాథ్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పశుగ్రాస పెంప కం, పశువుల షెడ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పశుగ్రాస పెంపకానికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు వివరించి అర్హులను గుర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మన్మథరావు, ఏపీవో శ్రీనివాసరావు, పశువైద్యాధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ గంగరాజు

గార రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ గంగరాజు అన్నారు. మంగళ వారం కొర్లాం జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నారీశక్తి కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. మొగదాలపాడులో గ్రామ స్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా

స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దని కోరుతూ వామపక్షాలు, ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం సబ్ స్టేషన్ల వద్ద ధర్నా నిర్వహించారు. ఆదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలన్నారు. ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం



పలాస: విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వామపక్ష నాయకులు







టెక్కలి, నరసన్నపేట, ఎచ్చెర్ల సబ్ స్టేషన్‌ల వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నేతలు

రేపు చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురు వారం స్థానిక బాపూజీ కళామందిర్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత వస్త్రాలయ అధికారి టి.జనార్దనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు హ్యాండ్లూమ్ వాక్, చేనేత కార్మికులతో ముఖాముఖి, ప్రఖ్యాతి పొందిన చేనేత కార్మికులకు సత్కారాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పాల్గొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు.

క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే

అరసవల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే సక్రమంగా చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత అన్నారు. కామన్ క్యాన్సర్లపై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లకు మంగళవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శిక్షణ నిర్వహించారు. క్యాన్సర్ ప్రాథమిక స్క్రీనింగ్, ఇంటి వద్ద సర్వే, ప్రజలతో సంభాషణల్లో అనుసరించాల్సిన విధానాలు, డేటా నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం టీవోటీలు మండలాల్లో క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ శిక్షణ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేన్సర్‌ను త్వరితగతిన గుర్తించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, హెల్త్ ఎడ్యుకే టర్లు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల అమలు

లావేరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని, ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర అన్నారు. మంగళవారం లావేరు పంచాయతీ కేశవరాయపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నిడిగంట్ల త్రినాథ్, కూటమి నాయకులు లంకలపల్లి శ్రీను, మాకన శంకర రావు, గండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

సరుబుజ్జిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భిణులు ఆరోగ్యవంతంగా ఉండాలంటే సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఎస్ఐ హైమావతి, ఐసీడీఎస్ పీవో గీత కోరారు. మంగళవారం రావివలసలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శక్తియాప్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఎస్ఐ తెలిపారు. తల్లి పాలతో బిడ్డకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వండాన కృష్ణ, రొట్టవలస సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.జానకి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

కంచిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పోలేరు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, గంగ, కృష్ణవేణి పాల్గొన్నారు

తురక శాసనాంలో..

సోంపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి సెక్టార్ పరిధి తురక శాసనాం అంగన్ వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో వసుంధ రాదేవి, సూపర్‌వైజర్ సునీత తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలతో గ్రామాల అభివృద్ధి

పొందూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారా యణ అన్నారు. మజ్జిలపేట గ్రామంలో రెండు రోడ్ల నిర్మాణాలకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షురాలు గురుగుబెల్లి భవాని, మాజీ ఎంపీటీసీ ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మోటారు రవాణా చట్టంపై అవగాహన

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మోటారు రవాణా కార్మికులకు చట్టంపై అవగాహన సదస్సు మంగళవారం స్థానిక డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. ఉప కార్మిక కమిషనర్ కె.దినేష్ కుమార్ రవాణా చట్టం, పనిగంటలు, జీతాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కార్తికేయ, ఆర్టీవో అనిల్, కార్మికులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా ఆది కర్మయోగి శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమం కోసం ఆదివాసీ ప్రాంతాల్లో పని చేసే అధికారులకు ఆది కర్మయోగి శిక్షణ దోహదపడుతుందని, పరిపాలనలో సమర్థత పెరుగు తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి అధికారులకు ఆది కర్మయోగి-రెస్పాన్సివ్ గవర్నెన్స్ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంలో గ్రామ స్థాయిలో శాశ్వత మార్పులకు అవకాశం కలుగుతుందన్నారు. గిరిజన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించాలంటే వారి జీవన స్థితిగతులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం వినూత్నమైనదని, గ్రామాల్లో యువత, మహిళలు, వలంటీర్లకు శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో అందించే సేవల్లో మార్పునకు దోహదపడుతుందన్నారు. అధికారులు ఈ శిక్షణను పూర్తి స్థాయిలో వినియోగించుకుని క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా పనిచేయాలని సూచించారు.

ఒడియా సీఆర్టీలను నియమించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

సోంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధి లోని కంచిలి, సోంపేట, మందస మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠ శాలల్లో ఒడియా సీఆర్టీలను నియమించాలని ఎమ్మెల్యే బెం దాళం అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దిన కర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందిం చారు. ఐటీడీఏ పరిధిలో ఒడియా విద్యార్థుల కోసం ఒడియా పాఠశాలలను నిర్వహిస్తుండగా వాటిలో తెలుగు సీఆర్టీలు ఉన్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

మోడల్ వీవోగా బూరవెల్లి



వీవో సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

గార, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆదర్శవంతమైన గ్రామ సంఘాల ఆర్థిక లావాదేవీలపై పారదర్శకత కోసం జిల్లాలో ఐదు మోడల్ గ్రామ సంఘాలను సెర్ప్, డీఆర్డీఏ అధికారులు గుర్తించారు. వీటిలో గార మండలం బూరవెల్లి, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల్లో రెండేసి చొప్పున సంఘాలను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం బూరవెల్లిలో వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు, సీఎఫ్‌లు, గ్రామ సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మోడల్ వీవోలోని సభ్యులు ఆ సంఘంలోని జరిగే ఆర్థిక లావాదేవీలపై, ప్రభు త్వం అందించే వివిధ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కొత్త విధానం అమలు చేస్తోందని వెలుగు ఏపీఎం సుజాత తెలిపారు. బూరవెల్లి గ్రామ సంఘంలో 42 స్వయం సహాయక సంఘాలుండగా వాటిలో 464 మంది సభ్యులున్నారని చెప్పారు. సమావేశంలో ఎల్‌సీ రామారావు, సీసీ రామప్పడు, వీవోఏ డి.కొండమ్మ, సంఘం అధ్యక్షురాలు ఎల్.సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రికి వినతి



మంత్రి రామ్మోహన్ నాయుడుకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కంచిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 31 పంచాయతీల్లో సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనులకు అదనంగా నిధులు మంజూరు చేయాలని మండల టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు ఢిల్లీలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం కలిసి సమస్యలను విన్నవించారు. ట్రైన్ల నిలుపుదల చేయాలని, పోస్టల్ కార్యాలయం మార్పు చేయాలని, నెట్‌వర్క్ సాంకేతిక సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు. మఖరాంపురం, ఆదివారం సంత, మండపల్లి, కుత్తుమ మీదుగా ఇసుకల పాలెం, కొండపోలేరు, కొనక, నువగడ పంచాయితీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, పెద్ద శ్రీరాంపురం రెవిన్యూ విలేజ్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, బొడ్డ హరిబాబు, మద్దిల భాస్కర్ ఉన్నారు.

రేషన్ డిపోల్లో వివరాల బోర్డులేవీ?



రణస్థలం హైస్కూల్లో ఎండీఎంను పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు

రణస్థలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల నిర్వహణ బాగులేదని, డిపోల వద్ద వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని రాష్ట్ర ఫుడ్‌కమిటీ సభ్యుడు బి.కాంతారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం పైడిపేట, పతివాడ పాలెం, జేఆర్‌పురం రేషన్ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. జేఆర్‌పురం రేషన్ డిపో రికార్డులను పరిశీలించగా 20 బస్తాల వరకు బియ్యం తక్కువ ఉన్నట్లు గుర్తించారు. పతివాడపాలెం, పైడిపేట రేషన్‌డిపోల్లో రికార్డులు సక్రమంగా లేవని, రేషన్ డిపోల వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయలేదని ఆయన మండిపడ్డారు. సంబంధిత రేషన్ డిపోల డీలర్లకు మెమోలు జారీ చేయాలని అధికారులకు ఆదేశించారు. పిన్నింటిపేట అంగన్‌వాడీ కేంద్రం, రణస్థం జడ్పీ హైస్కూల్ ను సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారం ఇవ్వాలని సూచించారు.

స్త్రీనిధి రికవరీలో జిల్లా మొదటిస్థానం

పొందూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాల రికవరీలో శ్రీకాకుళం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా స్త్రీనిధి ఏజీఎం వి.సత్యనారాయణ అన్నారు. వెలుగు కార్యాలయంలో మంగళవారం స్త్రీనిధి రుణాల రికవరీపై వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలం స్త్రీనిధి రుణాల రికవరీలో ముందంజలో ఉండడంతో జిల్లా 99 శాతం రికవరీ సాధించిందన్నారు. 2025-26లో రూ.278 కోట్ల రుణాలు లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. సమావేశంలో ఏపీఎంలు రమణమూర్తి, గురుగుబెల్లి శ్యామలరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గొర్లెపాడులో రోడ్డు నిర్మాణం

కవిటి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గొర్లెపాడు పంచాయతీ సంత కాలనీలో సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఎమ్మెల్సీ నర్తు రామారావు శంకుస్థాపన చేశారు. పంచాయతీ నిధులతో నిర్మిస్తున్నామన్నారు. సర్పంచ్ వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించండి

ఆమదాలవలస, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని మునిసిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురం ఎస్సీ కాలనీ మాజీ కౌన్సిలర్ పెంకి వేణుగోపాల రావు, సిరిపురపు తౌడు కోరారు. ఈ మేరకు మంగళవారం మునిసిపల్ ఏఈ జాన్సన్ ఎస్సీ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. కాలనీలో గడిచిన పదేళ్లుగా ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీలో ఉన్న ఒక్క మంచి నీటి కుళాయిపై 60 కుటుంబాలు ఆధా రపడాల్సి వస్తోందన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు రేపు జిల్లా జట్ల పయనం

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్లు ఈనెల 7న బయలుదేరుతాయని జిల్లా అథ్లె టిక్స్ సంఘం అధ్యక్షుడు కె.మధుసూదన రావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు అదేరోజు రాత్రి 8 గంటలకు ఆమదాలవలస రైల్వే స్టేషన్ వద్దకు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పదో తరగతి మార్కుల మెమో, రెండు పాస్ పోర్టు ఫొటోలతో ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవ రావు వద్ద రిపోర్టు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో అండర్-14, 16, 18, 20 బాల బాలికలు గమనించాలన్నారు.

టీచర్ ప్రోత్సాహం.. గ్రామస్థుల చొరవ

(ఐదో పేజీ తరువాయి)

రాజేష్ గ్రామస్థులకు చెప్పారు. దీంతో గ్రామస్థులంతా కలసి ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లారు. పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. మొత్తంగా ఈ ఏడాది 55 మంది విద్యార్థులు అయ్యారు. దీంతో నూతన పాలసీ ప్రకారం మోడల్ ప్రైమరీ పాఠశాల అయ్యేందుకు అవకాశం ఉందని హెచ్ఎం రాజేష్ తెలిపారు. ఎంఈవో ధనుంజయ మజ్జి పాఠశాలను మంగళవారం సందర్శించి గ్రామస్థులు, ఉపాధ్యాయుడిని అభినందించారు.

చెన్నైలో ఇసుకలపాలెం మత్స్యకారుడు మృతి


నీలకంఠం (ఫైల్)

సోంపేట రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇసుకలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు నీలకంఠం (32) చెన్నై కాశిమేడు ప్రాంతంలో మంగళవారం మృతి చెందినట్టు ఆ గ్రామ పెద్ద బైపల్లి ఈశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యులు, ఆయన తెలిపిన వివరాల మేరకు.. నీలకంఠం చెన్నైకు వలసవెళ్లి చేపల వేట సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత ఏప్రిల్‌లో గ్రామానికి వచ్చి మళ్లీ చెన్నై వెళ్లాడు. రెండు రోజుల కిందట పది మంది మత్స్యకారులతో కలిసి సముద్రంలో వేట సాగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ బోటు నుంచి జారిపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న ఆయన్ని తోటి మత్స్యకారులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీలకంఠానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాలేక అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఇంటిపెద్ద చనిపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం

పాతపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఈనెల 9న ఘనంగా నిర్వహిస్తామని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డ్ వేదికగా శనివారం మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పరిధి జిల్లాలో గల 16 మండలాల్లోని గిరిజన ప్రజలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహస్తామన్నారు. అలాగే సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పార్వతీపురం మన్యం జిల్లాలో గల నాలుగు మండలాల గిరిజన ప్రజలతో ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహించునున్నట్టు తెలిపారు. గిరిజన సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దళితులను వేధించడం తగదు

కోటబొమ్మాళి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దళితుల భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ యంత్రాంగమే వారిని వేధించడం తగదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం, సీఐటీయూ నాయకులు హనుమంతు ఈశ్వరరావు అన్నారు. వీరు మంగళవారం మండల కేంద్రానికి చెందిన దళితులు సాగుచేస్తున్న గరీబుల గెడ్డవద్ద ఉన్న భూమిని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల కిందట 20 మంది దళితులకు ప్రభుత్వం డీ పట్టా కొంత స్థలాన్ని అందించింది. ఇప్పుడు ఆ స్థలాన్ని తిరిగి ప్రభుత్వం తీసుకొని అక్కడ డిగ్రీ కళాశాల నిర్మిస్తామని ఓ వైపు అధికారులు చెబుతున్నారని, అయితే ఈ స్థలంపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేసినట్టు తెలుస్తుందన్నారు. రెవెన్యూ, రాజకీయ నాయకులు దళితులపై ఒత్తిడి ఆపకపోతే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు కాళ నరసింహులు, బండి మోహన్, దేవాది ఉమామహేశ్వరరావు, కుప్పిలి మురళి, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండ్ అంబాసిడర్లుగా ఎదగాలి


శిక్షణలో పాల్గొన్నవారితో జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రణాళికతో అమలు చేయబడుతున్న ఏపీఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ప్రాజెక్టులకు మహిళలలే అంబాసిడర్‌లు కావాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. సుభలయ ఆర్ఆర్ కాలనీలో ప్రపంచ బ్యాంకు సౌజన్యంతో ఏపీఎంఎస్ నోడల్ ఏజెన్సీగా ఉమెన్ ఎంప్లాయిమెంట్ లక్ష్యంతో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. శిక్షణ శిబిరానికి వచ్చిన వారికి కరదీపికలు అందజేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డి.స్వరాజ్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కొత్తూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ జిల్లా కార్యదర్శి కాపల ధమయంతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఇరపాడుగూడ గిరిజన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రధాని మోదీ అందిస్తున్న పాలనపై వివరిస్తూ కరపత్రాలు గిరజన ప్రజలకు అందజేశారు. గిరజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి సమష్టగా కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బూరడ భాస్కరావు, నాయకులు ప్రసాదరావు, నరసింహులు, తోయక ఆనంద్, పొద్దిన నారాయణరావు తదితరలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణితావధానం

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల సమీకృత వసతిగృహంలో మంగళవారం గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మడ్డు తిరుపతిరావుచే 168వ గణితావధన కార్యక్రమాన్ని నిర్వహించారు. గణితంలో లబ్ద ప్రతిష్టలైన పది మంది విద్యార్థినులు పృచ్ఛకులుగా వ్యవహరించి ఆకట్టుకుంది. వసతిగృహ సంక్షేమాధికారి జి.విజయలక్ష్మి, జనజాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తి, కుమార్ నాయక్, రవికుమార్, తెలుగు భూషణ అవార్డు గ్రహీత మూల తాతయ్య పాల్గొన్నారు.

ఎరువులు సక్రమంగా విక్రయించాలి

జలుమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు రైతులకు సక్రమంగా విక్రయించాలని తహసీల్దార్ జె.రామారావు ఆదేశించారు. చల్లవానిపేట కూడలిలో గల ఎరువుల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు విక్రయించడంతో పాటు వేపపిండి, డీఏపీ, పురుగులు మందులు లింకు పెడుతున్నట్టు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వ్యాపారుల వద్ద ఉన్న యూరియా స్టాకులు పరిశీలించి స్టాకు ఉన్నంతవరకు గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు ఇచ్చిన స్లిప్‌లు ప్రాప్తికి రైతులకు ప్రభుత్వ ధరలకే విక్రయించాలని సూచించారు. ఈ పరిశీలనలో వ్యవసాయాధికారి కె.రవికుమార్, వీఆర్వో అర్జునరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పేదల అభివృద్ధే పీ-4 లక్ష్యం

- 19న ప్రారంభించేందుకు సిద్ధంకండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు


ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా చేపట్టిన పీ-4 కార్యక్రమాన్ని ఈనెల 19 ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో అమరావతిలోని సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది అట్టడుగు స్థానంలో ఉన్న 20శాతం మంది పేదలను స్వచ్ఛందగా ముందుకు వచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఈనెల 15లోగా ఎంపికలను పూర్తి చేసి, 19న ప్రారంభానికి సిద్ధంగా ఉండాలన్నారు. బంగారు కుటుంబాలను ఇప్పటికే దత్తత తీసుకున్న వారిని అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, సీపీవో ప్రసన్నలక్ష్మి, డ్వామా పీడీ సుధాకర్, ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులను ఏమార్చి..

- ఏటీఎంల నుంచి సొమ్ము చోరీ
- ముగ్గురి అరెస్టు ● రూ.5.60 లక్షలు రికవరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట అప్పారావు, సీఐ మంగరాజు

సోంపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏటీఎంల వద్ద ఖాతాదారులను ఏమార్చి నగదు చోరీ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం సోంపేటలో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. ఒడిశాకు చెందిన దాకాటి హద్య, సింహాచలం సాహు, బురిడి అశోక్ పాత్రో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. అమాయకులు, నిరక్ష్యరాస్యుల ను లక్ష్యంగా చేసుకొని ఏటీఎంల వద్ద కాపుకాస్తూ.. ఏటీఎం వాడడం తెలియని వారు వస్తే డబ్బులు తీస్తామని చెప్పి వారి నుంచి కార్డు తీసుకొని తొలుత డబ్బు తీసి ఇచ్చేవారు. ఆ తరువాత వారి వద్ద ఉన్న నకిలీ ఏటీఎం కార్డును సదరు వ్యక్తులకు అందించేవారు. ఆ తర్వాత అసలు ఏటీఎం కార్డుతో ఖాతాలో ఉన్న మొత్తాన్ని కాజేసేవారు. ఈ విధంగా శ్రీకాకుళం టౌన్, ఆమదాలవలస, రాజాం, పాతపట్నం, కాశీబుగ్గ, కంచిలి, మందస, కోటబొమ్మాళి, చీపు రుపల్లి, కళింకోట, ఒడిశాలో చోరీలకు పాల్పడ్డారు. ఇలా వీరు రూ.17,21,240 దొంగలించారని, అందులో రూ.5,60,000, ఒక ద్విచక్ర వాహనం, ఏటీఎం కార్డులు రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ మంగరాజు, ఎస్ఐ లవరాజు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే


ప్రమాణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్ఎన్ పేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఖరీఫ్‌లో రైతులకు అండగా నిలచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయాన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షుడిగా కె.మన్మథరావు, డైరెక్టర్లుగా వై.రాంబాబు, కె.శ్రీనుతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, నాయకులు వి.ఆనందరావు, ఎస్.కిషోర్‌కుమార్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.తేజేశ్వరరావు, వి.గోవిందరావు, కె.తిరుపతిరావు, ఎస్.మోహనరావు, టి.అప్పన్న, కె.కృష్ణమాచారి, జి.రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 కార్యక్రమంపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై నీచంగా మాట్లాడడం దారుణం


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హరిపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఒక మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మహిళా ఎమ్మెల్యే అయిన గౌతు శిరీషపై నీచమైన విమర్శలు చేయడం దారుణమని మందస మండల టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. హరిపురంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు బావన దుర్యోధన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి చూడలేదన్నారు. గత ఐదేళ్ల మహిళా నాయకురాలు అని చూడకుండా సోషల్ మీడియా వేదికగా చేస్తున్న దాడిని ప్రజలు గమనిస్తునే ఉన్నారన్నారు. కిడ్నీ ఆసుపత్రి నిర్మాణానికి 2018లోనే అప్పటి సీఎంగా చంద్రబాబు శంకుస్థాపన చేశారని, బావనపాడు పోర్టు, రైల్వే పై ఓవర్, మందస డబుల్ రోడ్డు వంటి అన్నీ గత టీడీపీ హయాంలో శంకుస్థాపన చేసినవేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు, నాయకులు రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, సాలిన మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా విజయవంతం చేయాలి

నరసన్నపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులతో ఆయన సమీక్షించారు. బహుళ జాతి కంపెనీల్లో పనిచేసేందుకు ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లమా తదితర కోర్సులు చదివన వారు హాజరు కావాలన్నారు. 11 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్టు తెలిపారు. ఆసక్తిగలవారు 9949900672, 9908590730 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు. అనంతరం అనారోగ్యం బాధపడుతున్న నరసన్నపేట పట్టణానికి చెందిన సింగంశెట్టి రాజు వైద్యు ఖర్చులు కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.20వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకుడులు శిమ్మ చంద్రశేఖర్, రోణంకి కృష్ణంనాయుడు, పోగోటి ఉమామహేశ్వరి, గొద్దు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా సంతబొమ్మాళి చెత్త సంపద కేంద్రం

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ మోడల్ సుప్రీమ్ ఎల్‌టీసీగా నిలిచిందని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డీపీవో కె.భారతీసౌజన్య అన్నారు. తడి, పొడిచెత్త వేరుచేయడం, డస్ట్‌బిన్ల వినియోగం, డ్రైన్లు శుభ్ర పరచడం వంటివి చేపట్టి ఆదర్శంగా నిలిచిదన్నారు. అనంతరం సంతబొమ్మాళిలో హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాస్, సర్పంచ్ లక్ష్మి, డీపీఆర్‌సీ బృందం పాల్గొన్నారు.

సాగునీటి కష్టాలు తీర్చండి


జేఈతో మాట్లాడుతున్న నీటి సంఘాల అధ్యక్షులు

కోటబొమ్మాళి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల వేసిన వరినాట్లు ఎండిపోతున్నాయని వంశధార కాలువ ద్వారా సాగునీరు అందించాలని గోవిందపురం, శ్రీజగన్నాథపురం 29ఆర్, ఎలమంచిలి నీటి సం ఘాల కమిటీ అధ్యక్షులు కర్రి అప్పారావు, సాసుమంతు అనందరావు, రోణంకి లీలామోహనరావు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక వంశధార కార్యాలయంలో జేఈ ధర్మాన లోకేష్‌కు కలిసి సమస్యను వివరించారు. ముఖ్యంగా శ్రీజగన్నాథపురం, తోటాడ, నర్సాపురం, లఖందిడ్డి, బడ్డిపేట, గంగరాం, ఊడికలపాడు, సీతన్నపేట వంటి ప్రాంతాలకు టైలాండ్‌కు నీరు అందడం లేదన్నారు. ఇక నుంచి ఈ సమస్య లేకుండా చూస్తానని జేఈ హామీ ఇచ్చారు.

తాగునీటి కూలర్ వితరణ

జలుమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరొందిన శ్రీముఖలింగేశ్వర ఆలయానికి యూనియన్ బ్యాంకు ప్రతినిధులు తాగునీటి కూలర్ వితరణగా మంగళవారం అందించారు. ఆ బ్యాంకు డిప్యూటి జీఎం హేమరాంశంకర్ ఆధ్వర్యంలో కూలర్‌ను ఆలయ ఈవో వాసుదేవరావు అందించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు టి.రాజు, డిప్యూటి జనరల్ మేనేజరు గాయిత్రీ ఆచార్య, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

టీ తాగుదాం.. రండి

- సమస్యల పరిష్కారం కోరుతూ వినూత్నంగా ఉద్యోగుల నిరసన

హిరమండలం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వంశధార కట్టడాల విభాగం కార్యాలయంలో ఉద్యోగులు టీ తాగుదాం రండి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆ సంఘ రాష్ట్ర నాయకల పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్య క్రమంలో సంఘ నాయకులు మీసాల వరప్రసాదరావు, గుగ్గిలి కల్యాణ్, పి.రవికుమార్, వసంతరావు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం టీ తాగుదాం రండి కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర సంఘ ప్రతినిధుల పిలుపు మేరకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఆర్జిత సెలవులు రూపంలో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖలో వివిధ భాగాల్లో పనిచేస్తున్న అటెండర్ స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు పాల్గొన్నారు.


హిరమండలం: టీ తాగుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు


నరసన్నపేట: ఎంపీడీవో కార్యాలయంలో..

అనాలోచిత విధానాలు అమలు చేయొద్దు

ఎల్ఎన్ పేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపడాలంటే ప్రభుత్వం అమలు చేస్తున్న అనాలోచిత విధానాల్లో మార్పులు చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. స్థానిక రోటరీనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు వివిధ రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు నెరవేర్చలేని హామీలిచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి విద్యా వ్యవస్థను నీరుగార్చుతున్నాయని ఆరోపించారు. అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యా వ్యవస్థపై ప్రభావం పడుతుందన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు పి. రామకృష్ణ, సీహెచ్ సూర్యారావు, పి.ప్రభాకరరావు, ఎ.వెంకట్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లను గుర్తించాలి

పాతపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుడ్ టచ్‌బ్యాడ్ టచ్‌లను గుర్తించాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండల పరిధిలోని రంకిణిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆమె మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌లను గుర్తించి బ్యాడ్‌టచ్‌లను అడ్డుకోవాలన్నారు. అలాగే బాల్యదశలో తెలియని తనాన్ని అధిగమించేలా ఎప్పటికప్పుడు ప్రవర్తనాతీరుపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిశితపరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలోనే ప్రభుత్వ సేవలు

పాతపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు అందుకొనేలా ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెట్టిందని టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ అన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వం పేరిట వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ మంగళవారం పాతపట్నంలో నిర్వహించారు. స్థానిక బస్‌స్టాండ్ కూడలి నుంచి ఆలాంధ్ర రోడ్‌కూడలి వరకూ ఈ ర్యాలీ సాగింది. అనంతరం మానవహారం ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సైలాడ సతీష్, కె.మన్మథరావు, అక్కంధ్ర సన్యాసిరావు, ఎస్.జోగారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

పాఠశాలలకు వైఫై రౌటర్లు

నందిగాం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇన్‌స్టా వైఫై రౌటర్లు అందాయి. దీంతో మంగళవారం నందిగాం ఎంఆర్‌సీలో రాష్ట్ర పరిశీలకులు ఏసుదాసు వీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వాటి పనితీరు, యాక్టివేషన్ తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. మొత్తం 99 పాఠశాలలకు విడుదల కాగా, తొలివిడతగా జియో సిగ్నల్స్‌తో 26 పాఠశాలలకు అందించారు. మిగతా పాఠశాలలకు ఆయా ప్రాంతాలకు నెట్ సేవలు ఆధారంగా అందించడం జరుగుతుందని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావులు తెలిపారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం



జలుమూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు చేశారు. సాయంత్రం గర్భగుడిలో గల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను అలంకరించి, పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, శివ, అచ్యుత, దేవాదాయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చెడిపోయిన ఫోన్లతో పనిచేయలేం

జలుమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) చెడిపోయిన ఫోన్లతో పనిచేయలేమని అంగనవాడీ కార్యకర్తలు స్పష్టం చేశారు. ఈ మేరకు సారవకోట ఐసీడీఎస్ ప్రాజక్టు అధ్యక్షురాలు పి.సూర్యం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పీవో వంశీప్రియను కలిసి వారంతా సెల్ ఫోన్లు అందచేశారు. సోమవారం మా సెల్‌ఫోన్లు పీవోకు అందచేస్తే ముందస్తు నోటీసు లేకుండా తీసుకోమని చెప్పారని, అందువల్ల ఉదయం నోటీసు ఇచ్చి సాయంత్రం ప్రాజక్టు పరిధిలోని 193 కేంద్రాలకు చెందిన సెల్‌ఫోన్లు పీవోకు అందచేశామన్నారు.

రైస్ మిల్లర్ల సంఘం జిల్లా శాశ్వత గౌరవ ఉపాధ్యక్షుడు మృతి


మోహనరావు (ఫైల్)

కోటబొమ్మాళి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా శాశ్వత గౌరవ ఉపాధ్యక్షుడు డోకి మోహనరావు(85) వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. మోహనరావు రాజకీయవేత్తగా, మండల ఉపాధ్యక్షుడిగా, హరిశ్చంద్రపురం సర్పంచ్ సేవలందించారు. వివిధ ఆలయాలకు పాలక మండలి సభ్యుడిగా, ధర్మకర్తగా వ్యవహరించారు. హరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన మోహనరావు వ్యాపారవేత్తగా కొన్నేళ్ల కిందట కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఈయనకు ఒక కుమారుడు రమణమూర్తి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నాయకులు కింజరాపు హరివర ప్రసాద్, బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్ తదితరులు మోహనరావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా మోహనరావు మృతికి హరిశ్చంద్రపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఒక పూట సెలవు ఇచ్చి నివాళులర్పించారు.

సంతబొమ్మాళి మాజీ ఎంపీపీ..

సంతబొమ్మాళి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత, మాజీ ఎంపీపీ సూరడ భీమారావు మంగళవారం మృతి చెందాడు. ఈయన గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. భీమారావు మృతిపై టీడీపీ నాయకులు నౌపడ సత్యనారాయణ, ధనరాజ్, రాజశేఖర్, ధనరాజు తదితరులు సంతాపం తెలిపారు.

దిలీప్ క్రికెట్ ట్రోఫీకి టెక్కలి యువకుడు ఎంపిక


త్రిపురాన విజయ్

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన దిలీప్ క్రికెట్ ట్రోఫీకి టెక్కలికి చెందిన యువకుడు త్రిపురాన విజయ్ ఎంపికయ్యాడు. గత సీజన్ రంజీ మ్యాచ్‌ల్లో విజయ్ 26 వికెట్లు సాధించి సత్తాచాటాడు. రాజస్థాన్‌లో జరిగిన తొలిమ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసి ఆంధ్రా విజయంలో కీలకపాత్ర పోషించి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పొందాడు. ఆంధ్రా, హైదరాబాదు జట్లు మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐదు వికెట్లు, విదర్భ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. రంజీ మ్యాచ్‌ల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా విజయ్ దిలీప్ ట్రోఫీకి ఎంపికయ్యాడు. అలాగే సయ్యద్ ముస్తాక్ ఆలీ ట్రోఫీతో సహా పలు దేశ వాళీ క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. దక్షిణ భారత జట్టుకు రాష్ట్రం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహి స్తుండగా.. అందులో విజయ్ ఒకరు కావడం విశేషం. ఈ ఏడాది ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఎంపికైన విజయ్.. గత నాలుగు సీజన్లగా ఆంధ్రా ప్రీమియం లీగ్‌లో రాణిస్తున్నాడు. 2025-26 సీజన్ దిలీప్ ట్రోఫీ మ్యాచ్‌లు ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్నాయి. జిల్లా నుంచి ప్రతిభ కనబరుస్తున్న విజయ్‌కు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్ష, కార్యద ర్శులు పుల్లెల శాస్త్రి, షేక్ అసీస్ రాజా, మెంటార్ ఇలియాస్ అభినందనలు తెలిపారు.

బీఎస్పీకి చింతాడ రాజీనామా

టెక్కలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి టెక్కలి నియోజకవర్గానికి చెందిన చింతాడ శ్రీనివాస్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ పార్టీ పదవులకు, సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు తెలిపారు. కాగా 2024లో జరిగిన ఎన్నికల్లో టెక్కలి నుంచి బీఎస్పీ అభ్యర్థిగా చింతాడ శ్రీనివాస్ పోటీచేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వండి

నరసన్నపేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇస్తానని చెప్పిన కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని నరసన్నపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. ఎన్నికలు జరిగి ఏడాదైనా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన ప్రెస్‌క్లబ్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ ఆర్.సత్యనారాయణకు వినత పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత

(ఐదో పేజీ తరువాయి)

చేస్తుంటాడు. ఇదే వ్యాపారంతో గంజాయి విక్రయిస్తున్న మన్‌ఖురేల్ ప్రాంతానికి చెందిన ఆకాష్‌తో మణికుమార్‌కు పరిచయం అయింది. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మోహన్ ప్రాంతానికి చెందిన అశోక్ అలియాస్ సిద్ధాంత నాయక్ వద్దకు వెళ్లి గంజాయిని తీసుకొస్తే రూ.10 వేలు ఇస్తానని చెప్పడంతో దీనికి ఆశపడిన మణికుమార్ ఒడిశా వెళ్లాడు. అక్కడ 12.6 కిలోల గంజాయి కొనుగోలు చేసి బస్సులో ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. పట్టణ ఎస్ఐ ముకుంద రావుతో తన సిబ్బందితో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న మణికుమార్‌ను విచారించగా గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో గంజాయి మూటలను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

కరజాడలో..

శ్రీకాకుళం రూరల్: కరజాడ ఇసుక ర్యాంపు, మడపాం బ్రిడ్జి వద్ద సిబ్బందితో సోదా చేసి ఆరుగురి నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రాము తెలిపారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు బ్రిడ్జి వద్దకు వెళ్లేసరికి ఆరుగురు వ్యక్తులు ఆటోలో కూర్చొని ఉన్నారు. పోలీసులను చూసి వారు పారిపోతుండగా వారిని పట్టుకుని సోదా చేశారు. గంజాయికి అలవాటుపడడం, జల్సాలకు డబ్బు కోసం ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న పొట్లాలుగా మార్చి నరసన్నపేట, ఆమదాలవలస, శ్రీకాకుళం ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని తరలిస్తున్న శ్రీకాకుళం నగరానికి చెంది న బగ్గు నవీన్, వల్లంశెట్టి చందు, సైలాడ వేణుగోపాల్, కొయ్యల రోహిత్, ఆమదాలవలసకు చెందిన యాళ్ల కౌశిక్, నరసన్నపేట మండలం లింగాలపాడుకు చెందిన యారబాటి పుండరీకాక్షలను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక ఆటో, ఒక మోటార్ సైకిల్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గతంలోనూ వీరిపై గంజాయి తరలింపు కేసులు ఉన్నాయన్నారు.